క్రీడలతో ఉజ్వల భవిష్యత్



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఆకుల అరుణ్‌కుమార్

ముషీరాబాద్: క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ముషీరాబాద్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం సుమన్ లెజండ్రీ కప్–2025 పోటీలను ఇండియన్ షోటోకాన్ కరాటే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్టేట్ లెవల్ ఓపెన్ కరాటే పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆయన మెమోంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ డైరెక్టర్ నరేందర్, క్రీడాకారులు నర్సింగ్ రావు, గణేష్, సంపత్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గండు సంగీతకు డాక్టరేట్



గండు సంగీతకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ప్రొ. సుధాకర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సెంటర్ ఫర్ ఎకనామిక్స్ సోషల్ స్టడీస్, అంబేడ్కర్ యూనివర్సిటీ సంయుక్తంగా ఆఫర్ చేసిన పీహెచ్‌డీ పరిశోధన పూర్తి చేసినందుకు గండు సంగీతకు కామర్స్‌లో డాక్టరేట్ ప్రదానం చేశారు. భారత్‌దేశంలో హౌసింగ్ ప్రాముఖ్యత తెలంగాణలో హౌసింగ్ ఫైనాన్స్ విషయంలో ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ పాత్ర అనే అంశంపై ప్రొఫెసర్ సుధాకర్ పర్యవేక్షణలో తన పరిశోధనను పూర్తి చేసింది. పీహెచ్‌డీ పరిశోధన క్రమంలో అన్ని విధాలుగా సహకరించిన సెస్ డైరెక్టర్ రేవతి, మార్గదర్శకులు సుధాకర్, అంబేడ్కర్ యూనివర్సిటీ అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

చెత్తవేయకుండా సీసీకెమెరా, సైరన్‌ల ఏర్పాటు

ముషీరాబాద్: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటామని పీఅండ్‌టీకాలనీ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణా, లత అన్నారు. భోలక్‌పూర్ డివిజన్‌లోని పీఅండ్‌టీ కాలనీలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆదివారం చెత్త వేయడాన్ని గుర్తించే సీసీ కెమెరాలు, సైరన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కాలనీ పరిశుభ్రంగా ఉండేందుకు సీసీ కెమెరాలు, సైరన్‌లను ఏర్పాటు చేశామన్నారు. స్థానిక వ్యాపారులు రోడ్లపై చెత్త వేయకుండా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు చైతన్య, సంతోష్, జీహెచ్‌ఎంసీ జవాన్ రాజేష్, ఎస్ఎఫ్ఏలు హరిబాబు, రామకృష్ణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిజమైన కార్యకర్తలకే పదవులు ఇవ్వాలి

లిబర్టీ: కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం శ్రమించిన అసలు సిసలైన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు అన్నారు. ఏఐసీసీ, పీసీసీ నాయకత్వం పదేళ్ల తర్వాత పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో ముఖ్య భూమిక పోషించిన నాయకులను, కార్యకర్తలను గుర్తించాలని కోరారు. ఆదివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ త్వరలో పీసీసీ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు, కార్యనిర్వాహక కార్యదర్శులు, కార్యవర్గ సభ్యుల నియామకంలో క్షేత్రస్థాయి పరిశీలించి నిజమైన కార్యకర్తలు, నాయకులు గుర్తించి పదవులు కట్టబెట్టాలన్నారు. నామినేటెడ్ పదవుల్లోనూ నిజమైన కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు.

స్థానిక సంస్థల్లో దివ్యాంగులను నామినేట్ చేయాలి

జియాగూడ: రాష్ట్రంలోని పంచాయతీ, మున్సిపాలిటీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేసేందుకు వీలుగా ప్రత్యేక చట్టం చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక హైదరాబాద్ సౌత్ కమిటీ గౌరవ అధ్యక్షురాలు పి.శశికళ కోరారు. ఈ మేరకు దివ్యాంగుల హక్కుల వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జియాగూడలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల్లో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేసేందుకు ప్రత్యేక చట్టాలు చేసి అమలు చేస్తున్నారన్నారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ హామీ ఇచ్చిన ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందన్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టానికి సవరణలు చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో 25,538 వేల మందికి మున్సిపాలిటీల్లో 260, మున్సిపల్ కార్పొరేషన్లలో 26, మండల ప్రజా పరిషత్‌ల్లో 1080, జిల్లా పరిషత్‌లో 64 మందికి రాజకీయ అవకాశాలు వస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై కూడా ఎలాంటి ఆర్థిక భారం లేకుండానే 26,968 మందిని నామినేట్ చేయవచ్చని పేర్కొన్నారు.

ఫాల్గుణి మేళా.. నిషాన్ శోభాయాత్ర









కాచిగూడ: మహాభారత యుద్ధ సమయంలో శ్యామ్‌బాబా (కలియుగ కృష్ణుడు) తన శిరస్సును దానమిచ్చే రోజుగా చెప్పుకునే 'ఫాల్గుణి మేళా' వేడుకలను పురస్కరించుకుని ఆదివారం భక్తులు నిషాన్ శోభాయాత్ర చేపట్టారు. ఆధ్యాత్మికతను తెలియజేసే రంగు రంగుల జెండాలను చేతబట్టి గులాల్ రంగులు చల్లుకుంటూ ముందుకు సాగారు. కృష్ణుడి చిత్రపటాల ప్రదర్శన బ్యాండు మేళాలు, భజన కీర్తనలు, యువతీ యువకుల నృత్యాలతో సాగిన నిషాన్ శోభాయాత్ర అంబరాన్నంటాయి. కాచిగూడ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న వీరన్నగుట్ట శ్యామ్‌మందిర్‌లో నిర్వహించిన వేడుకలు కనులపండువగా జరిగాయి. వివిధ రకాల పూలతో అలంకరించిన రథాలలో రాధాకృష్ణుల విగ్రహాలు కొలువుదీరాయి. శ్యామ్‌మందిర్‌కు తరలివచ్చిన భక్తులకు శ్యామ్ మందిర్ సేవా సమితి ప్రతినిధులు ఇంద్రకుమార్ అగర్వాల్, రామ్‌దేవ్ అగర్వాల్, రాజ్‌కుమార్ విగ్‌ల ఆధ్వర్యంలో భక్తులకు స్వాగత ఏర్పాట్లను చేసి వారికి పూలతో స్వాగతం పలికారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

- అందుబాటులో 42 లక్షల 43వేల 247 పుస్తకాలు
- నగర సంస్థ పరిధిలో 87వేల 42 మంది సభ్యులు
- 190 మంది సిబ్బందిని భర్తీ చేయాల్సి ఉంది
- నగర కేంద్రగ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ



చిక్కడపల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, ఉపాధి మార్గాలని పాఠకులు వినియోగించుకోవాలని నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ అన్నారు. నగర కేంద్ర గ్రంథాలయంతో పాటు శాఖ గ్రంథాలయాలను అభివృద్ధి చేసే దిశగా అనేక ప్రణాళికలు సిద్ధం చేసి వాటి అమలుకు తీవ్రంగా కృషి చేస్తున్నామని అన్నారు. పాఠకులు, పోటీ పరీక్షల విద్యార్థులకు అనుగుణంగా వారి అభిలాష మేరకు పుస్తకాలను కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుతామని ఆన్‌లైన్‌లో కూడా పుస్తకాలను తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి సహకారంతో కూడా గ్రంథాలయ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని 'సాక్షి'కి ఆదివారం ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించారు.

ప్రశ్న: నగరంలో ఎన్ని గ్రంథాలయాలు ఉన్నాయి?

జవాబు: చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంతో పాటు కలిపి 82 శాఖ గ్రంథాలయాలు ఉన్నాయి. మొబైల్ గ్రంథాలయాలు ఇప్పుడు పనిచేయడం లేదు. అన్ని శాఖ గ్రంథాలయాల్లో 256 మంది ఉద్యోగుల అవసరం ఉంది. ప్రస్తుతం 66 మంది రెగ్యులర్ సిబ్బంది, 38 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. ఇంకా 190మందిని భర్తీ చేయాల్సి ఉంది.

ప్రశ్న: నిత్యం ఎంత మంది పాఠకులు వస్తుంటారు?

జవాబు: పాఠకులతో పాటు ప్రతినిత్యం 3వేల నుంచి 5వేల మంది పోటీ పరీక్షల అభ్యర్థులు వస్తుంటారు. రెండు రాష్ట్రాలకు చెందిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి వస్తారు.

ప్రశ్న: నగర కేంద్ర గ్రంథాలయంలో తాగునీటి సౌకర్యానికి ఎలాంటి చర్యలు చేపట్టారు?

జవాబు: 5 ప్రాంతాల్లో మినరల్ వాటర్ సౌకర్యం కల్పించాం. పోటీ పరీక్షల సమయంలో దాదాపు 5వేల మంది గ్రంథాలయానికి వస్తుంటారు. గ్రంథాలయం ఆవరణలో చైర్లు వేసుకుని చెట్ల కింద చదువుతుంటారు. 12 సంవత్సరాలుగా ఓపెన్ ఆడిటోరియంలో కూడా మొదటి అంతస్తులో వరండాలో చదువుతున్నారు.

ప్రశ్న: విద్యార్థుల కోసం ఏమి ప్రత్యేక సౌకర్యం కల్పించారు?

జవాబు: గ్రంథాలయంలో చదివే విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన వసతిని జీహెచ్‌ఎంసీ, హరే రామ హరేకృష్ణ ఫౌండేషన్‌తో మాట్లాడి మధ్యాహ్న భోజనం వసతిని రూ.5కే ఏర్పాటు చేశాం.

ప్రశ్న: గ్రంథాలయంలో ఎన్ని భాషల పుస్తకాలు లభ్యమవుతాయి. అన్ని పుస్తకాలు ఉన్నాయి?

జవాబు: 8 భాషాలలో పుస్తకాలు లభ్యమవుతాయి. నగర కేంద్ర గ్రంథాలయంతో పాటు మొత్తం 82 శాఖ గ్రంథాలయాల్లో 42 లక్షల 43వేల 247 పుస్తకాలు ఉన్నాయి. పోటీ పరీక్షల అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలను ఆన్ డిమాండ్‌పై తెప్పించి ఉంచాం.

ప్రశ్న: హైదరాబాద్ నగర గ్రంథాలయం సంస్థలో ఎంతమంది సభ్యులున్నారు?

జవాబు: నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ పరిధిలో 87వేల 42 మంది సభ్యులున్నారు. చిక్కడపల్లి నగర గ్రంథాలయ సంస్థ తరువాత, ఎస్ఆర్‌నగర్, నారార్జుననగర్ కాలనీ చంపాపేట్, ఇంద్రాప్రస్థాన్‌లలో పాఠకులు, విద్యార్థులు అధికంగా వస్తారు.

ప్రశ్న: గ్రంథాలయాలకు నూతన భవన నిర్మాణాలు జరుగుతున్నాయా?

జవాబు: 13 కొత్త గ్రంథాలయ భవనాలు, 33 భవనాలకు మరమ్మతులు రూ.18 కోట్లతో పనులు జరుగుతున్నాయి. నూతన భవనాలు మరో రెండు నెలల్లో అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం 64 సొంత భవనాలు ఉన్నాయి. అద్దెవి 9, సొసైటీ, సంస్థలు ఇస్తున్నవి 9 ఉన్నాయి.

ప్రశ్న: జీపీఎస్ మ్యాప్ కెమెరా యాప్ సిస్టమ్‌ను ప్రవేశ పెట్టడం వల్ల ప్రయోజనం ఉందా?

జవాబు: గతంలో గ్రంథాలయ ఇన్‌చార్జిగా పనిచేసిన అడిషనల్ కలెక్టర్ పళని కదిరవన్ ఈ సిస్టమ్‌ను ప్రవేశ పెట్టారు. దీంతో ఉద్యోగులు, సిబ్బంది సమయానికి గ్రంథాలయానికి చేరుకుని పూర్తిస్థాయి సేవలు అందిస్తున్నారు. దీని ప్రయోజనం ఉందనే చెప్పాలి. అయితే గ్రంథాలయ వేళలు ఉదయం 8గంట నుంచి రాత్రి 8గంటల వరకు ఉంటుంది. పోటీ పరీక్షల విద్యార్థుల కోసం గ్రంథాలయం ఆవరణలో ఉదయం 5గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు తెరచి ఉంటుంది.

ప్రశ్న: ఈ గ్రంథాలయంలో చదువుకునే వారు ఉద్యోగాలు సంపాదిస్తున్నారా?

జవాబు: ఉపాధ్యాయులుగా, గ్రూప్స్–1, 2, 3, 4, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, సివిల్స్ ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ ఉద్యోగాలు సంపాదిస్తున్నారు. ప్రస్తుతం ఆర్ఆర్‌బీ, పీవో, ఎస్ఎస్‌సీకి సిద్ధమవుతున్నారు. గ్రంథాలయ ఆవరణలో మర్రిచెట్టు, వేప, అల్లనేరేడు, బిల్వదళంతో పాటు చదువుల తల్లి సరస్వతి, బుద్ధుడు, తెలుగు తల్లి విగ్రహాలను కూడా ఏర్పాటు చేసి ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తున్నాం.

సాధికారత ప్రచారోద్యమాన్ని చేపడుతున్నాం

డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని జాతీయస్థాయిలో దళిత, బహుజన హక్కుల సాధికారత ప్రచారోద్యమాన్ని చేపడుతున్నట్లు డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమం, అభివృద్ధి, రక్షణ, బడ్జెట్, కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో మెజార్టీ ప్రజలైన ఎస్సీ, ఎస్టీ, బీసీలపై తరతరాలుగా వివక్ష, అణచివేత కొనసాగుతోందన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో సంక్షేమం అభివృద్ధికి తగిన నిధులు కేటాయించకపోవడం బాధాకరం అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అనగారిన వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెడుతూ అనగారినవర్గాలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చక్రధర బుద్ధా, ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, వెంకటయ్య, రమేష్, పులికల్పన తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌కుమార్

ఉత్సవ కమిటీల్లో కుల సంఘాల ప్రమేయాన్ని నిలువరించాలి

డీబీపీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

కాచిగూడ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీలో కుల సంఘాల ప్రమేయాన్ని పూర్తిగా నిలువరించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అంబేడ్కర్ జయంతిని సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన, కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరపాలన్నారు. ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత, మానవ హక్కుల ఉద్యమ పితామహులు అంబేడ్కర్ జయంతి వేడులకను బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలతో కలిపి నిర్వహించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ జయంతిని, బాబు జగ్జీవన్‌రామ్ జయంతితో కలిపి ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయవద్దని సూచించారు. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఏప్రిల్ 14న ప్రపంచ విజ్ఞాన దినోత్సవంగా పాటిస్తూ 193 సభ్య దేశాలు పిలుపునిస్తుంటే, తెలంగాణలో మాత్రం అంబేడ్కర్ స్థాయిని తక్కువగా చేసి చూపే ప్రభుత్వ ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ జయంతి వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.5వేల కోట్లు కేటాయించి ఉత్సవాలను ఘనంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయాలని కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు.

స్పీడ్ బ్రేకర్లు వేయండి.. ప్రమాదాలు నివారించండి



సుందరయ్య పార్కు వద్ద ఎదురెదురుగా ఢీకొన్న రెండు వాహనాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: అది ప్రధాన రహదారి... నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నారాయణగూడ ఫ్లైఓవర్ నుంచి సుందరయ్య పార్కు మీదుగా బాగ్‌లింగంపల్లి చౌరస్తా, వీఎస్‌టీ వరకు ఈ రోడ్డు ఉంటుంది. ఇక్కడ సుందరయ్య పార్కు వెనుక భాగంలోని టాయిలెట్ల సమీపంలో బాగ్‌లింగంపల్లి చౌరస్తాలో స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం ప్రమాదాలు జరిగే ఈ రెండు ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మాజీ స్పీకర్ శ్రీపాదరావుకు నివాళి



శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, రమణారావు

నల్లకుంట: బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి గంపా రామశర్మ ఆధ్వర్యంలో ఆదివారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తండ్రి, ఉమ్మడి ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు 88వ జయంతిని నిర్వహించారు. నల్లకుంటలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తనయుడు మాజీ కౌన్సిలర్ మల్‌రెడ్డి అభిషేక్ రెడ్డి, టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావుతో కలిసి అక్కడ ఏర్పాటు చేసిన శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు పేదల కోసం చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొత్తమీర మంగమ్మ, శివకుమార్, దేవులపల్లి రంగారావు, మంత్రి సునిల్, శ్యాంసుందర్‌రావు, రంజిత్‌కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్కూల్ కిట్ల పంపిణీ

అంబర్‌పేట: బండారు వైష్ణవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ కిట్లను పంపిణీ చేయనున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గోల్నాక లంక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే ఈ కార్యక్రమానికి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్యఅతిథిగా రానున్నట్లు ఆయన వెల్లడించారు.

7న మహిళా ప్రముఖులకు అవార్డుల ప్రదానం

లిబర్టీ: వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళలకు ఈ నెల 7న అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ అన్నారు. ఆదివారం ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు భారతీయ నారి శిరోమణి సన్మానం పేరిట అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఫారెన్ కరస్పాండెంట్ క్లబ్‌లో అవార్డుల ప్రదాన వేడుక ఉంటుందన్నారు.

మారుతీనగర్ అధ్యక్షుడిగా సురేష్‌గౌడ్

అంబర్‌పేట: గోల్నాక డివిజన్ మారుతీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పడింది. ఆదివారం మారుతీనగర్‌లో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా సురేష్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సలహాదారులుగా బాలకిషన్ మాధవరెడ్డి, మోహన్‌రెడ్డి, రాజులు, రమేష్, కుమారస్వామి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సురేష్‌గౌడ్ మాట్లాడుతూ.. మారుతీనగర్ సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి

డాక్టర్ సీహెచ్ఎన్ రాజకుమారి



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ సీహెచ్ఎన్ రాజకుమారి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ఎన్ రాజకుమారి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం, హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పేషెంట్లు తమ జీవన శైలిలో తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్లపై రాజకుమారి అవగాహన కల్పించారు. గాంధీ ఆస్పత్రిలో పేదలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజారోగ్య సేవలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ జిందాబాద్ వంటి స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి వీరయ్య మాట్లాడుతూ... వంద క్యాంపులను పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ఈ మెగా మెడికల్ క్యాంపుకు విశేష స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్ గోపాలం శివన్నారాయణ, డాక్టర్ రమాదేవి, హైదరాబాద్ జిందాబాద్ ఉపాధ్యక్షుడు ఎం. శ్రీనివాస్‌రావు, హస్మిత, మల్లం రమేష్, నాగేశ్వర్‌రావు, సంగీత తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో మున్నూరుకాపులకు అవకాశం కల్పించాలి




సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి శ్రీనివాస్‌రావు

కాచిగూడ: త్వరలో చేపట్టనున్న మంత్రివర్గ విస్తరణలో మున్నూరుకాపులకు అవకాశం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం కాచిగూడలోని మున్నూరుకాపు మహాసభ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలోనే అత్యధిక జనాభా కలిగిన మున్నూరుకాపులకు ప్రస్తుత మంత్రివర్గంలో ఒక మంత్రి పదవి కూడా కేటాయించకపోవడం దారుణమని అన్నారు. మున్నూరుకాపు భీష్మ పితామహుడు, కరుడుగట్టిన కాంగ్రెస్ వాది వి.హనుమంతరావుకు పార్టీలో, ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించాలని ఆయన కోరారు. ప్రభుత్వం చేపట్టిన కులగణనలో మున్నూరుకాపుల సంఖ్య తక్కువగా చూపారని దానిని సరిచేయాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం స్థానిక సంస్థలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహాసభ ప్రధాన కార్యదర్శి నగేష్, మహిళా అధ్యక్షురాలు చామకూర సుజాత తదితరులు పాల్గొన్నారు.

శతమర్కటం.. పితలాటకం!

- యూనివర్సిటీ పరిసర ప్రాంతాల్లో జీభత్సం సృష్టిస్తున్న కోతులు
- కుక్కల కంటే కోతుల సమస్యే ఎక్కువైందంటున్న స్థానికులు
- జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు





ముషీరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీ చుట్టుపక్కల ప్రాంతాలైన విద్యానగర్, అడిక్‌మెట్, రాంనగర్, ముషీరాబాద్, వారాసిగూడ, పద్మారావునగర్, తార్నాక, హబ్సీగూడ, రామంతాపూర్, అంబర్‌పేట్, డీడీకాలనీ తదితర ప్రాంతాల్లో కుక్కలకు ఏ మాత్రం తీసిపోకుండా కోతుల బీభత్సం సృష్టిస్తున్నాయి. కోతుల బెడదతో పాదచారులు, ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో తలుపులు తెరిచి ఉంటే ఇళ్లల్లోకి చొచ్చుకుని వచ్చి కూరగాయలు, పండ్లు, పాలు ఎత్తుకెళ్తున్నాయి. స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు మధ్యాహ్నం వేళల్లో ఆటో దిగి ఇళ్లలోకి వెళ్లాలంటే భయపడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ఎదురెళ్లి వారిని ఇళ్లల్లోకి తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. తెల్లవారుజామున 4.30గంటల నుంచి 5గంటల సమయంలో ఇంటి ముందు పాల ప్యాకెట్లు వేస్తే వాటిని చించేసి పాలు తాగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

- రేకులు ఉన్న ఇళ్ల మీద దూకుతూ ఇంట్లో వారిని భయాందోళనకు గురి చేస్తున్నాయి. డాబాల మీద, ఇళ్ల ముందు పూల కుండీలను పారవేసి అందులోని మొక్కలను పీకేస్తున్నాయి.
- కోతుల బెడదతో ఇంటి యజమానులు బాణసంచా కాల్చడం.. వాచ్‌మెన్‌లు గిన్నెల శబ్దాలు చేయడంతో అవి పలాయనం చిత్తగిస్తున్నాయి.
- నడుచుకుంటూ వెళ్లే వారితో చేతిలో బస్తాలు కనిపిస్తే దాడి చేసి లాక్కెళ్లిపోతున్నాయి.
- తాజాగా లక్ష్మి అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కూమారుడిపై కోతులు దాడి చేయగా గాయాలపాలయ్యాడు. ప్రస్తుతం అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.
- విద్యానగర్ చౌరస్తాలో జైపాల్‌రెడ్డి అనే వ్యాపారిపై ఇటీవల కోతులు దాడి చేసి చొక్కాను చించేశాయి. చాకచక్యంతో వాటి బారి నుంచి తప్పించుకున్నాడు.



అదనపు బృందాలు ఏర్పాటు చేయాలి

జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి చెప్పినట్లు కుక్కలను పట్టుకునేందుకు ఇప్పుడు ఉన్న 30 బృందాలు ఏ మాత్రం సరిపోవు. మరో 30 బృందాలను అదనంగా ఏర్పాటు చేసి కుక్కలతో పాటు కోతులు నివారణకు చర్యలు చేపట్టాలి. విద్యానగర్, అచ్యుతారెడ్డి మార్గ్ తదితర ప్రాంతాల్లో కోతులు బెడద తీవ్రంగా ఉంది. జీహెచ్‌ఎంసీ అధికారులు పరిస్థితిని గుర్తించి సమస్యను పరిష్కరించాలి.

– సాయికృష్ణయాదవ్, టీజేపీ డివిజన్ అధ్యక్షుడు

కోతులే మాకు ప్రధాన సమస్య..

కోతుల సమస్యే మాకు ప్రధాన సమస్య. గతంలో కూరగాయలు, పండ్ల చెట్లు పెంచుకునే వాళ్లం. కోతులు వాటిని పాడు చేస్తుండటతో మానేశం. చేతిలో ఏ వస్తువు ఉన్నా లాక్కుంటున్నాయి. దారిలో ఒంటరిగా వెళ్తున్న వారిపై దాడులు చేస్తున్నాయి. సంబంధిత అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపాలి.

– సాయిప్రసన్న, బాలాజీనగర్